క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న శివకృష్ణ గౌడ్

కొందుర్గు: మహదేవ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం షాద్‌నగర్ పట్టణానికి చెందిన శివ కృష్ణగౌడ్ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని భవిష్యత్‌లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేశ్, పాఠశాల హెచ్‌ఎం రజిత అంగన్‌వాడీ టీచర్ పార్వతమ్మ, రవీందర్ రెడ్డి, రాకేశ్ రెడ్డి, శివకుమార్, గణేశ్, రాములు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



ఎల్‌ఓసీ అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. ఇటీవల అస్వస్థతకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవీన్‌కుమార్‌రెడ్డికి మంజూరురైన సీఎంఆర్‌ఎఫ్ సంబంధించి ఎల్‌ఓసీని శుక్రవారం నగరంలో కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మర్రి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, సహకార సంఘం మాజీ డైరెక్టర్ కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి గత కొద్ది రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో చికిత్స పొందుతున్నారనే విష యం తెలుసుకొని అవినాశ్‌రెడ్డి బాధితుని ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసుకున్నారు. మెరుగైన వై ద్యం అందించాలని ఆయన వైద్యులను కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి

సీఐటీయూ సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



నాగర్‌గూడ చౌరస్తాలో జెండా ఆవిష్కరిస్తున్న దేవేందర్

షాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ దేశంలో అతి పెద్ద కార్మిక సంఘంగా ఎదిగిందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ కార్మిక వ్యతిరేకిగా మారారన్నారు. ఐక్య పోరాటాలతోనే తమకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, వెంకటయ్య, లక్ష్మయ్య, అనంతయ్య, సత్తయ్య, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



అవినాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న సతీశ్‌రెడ్డి

షాబాద్: మండల అభివృద్ధికి రూ.12కోట్ల నిధులు మంజూరు చేసిన్నట్లు జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పలువురు సర్పంచ్‌లు, నాయకులు అవినాశ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిల సహకారంతో మాచన్‌పల్లి నుంచి పోతుగల్ వరకు రోడ్డు పనులకు రూ.5 కోట్లు, ఏట్ల వర్రవల్లి బ్రిడ్జికి రూ.2కోట్లు, రేగడిదోస్వాడ నుంచి కొమరబండ వరకు రోడ్డు బ్రిడ్జికి రూ. 5కోట్లు ప్రభుత్వం మంజూచేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మా ర్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పీసరి సతీష్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, జంగయ్య, మాణిక్యంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చేవెళ్లలో 5కే రన్

చేవెళ్ల: 'ఐ ఓట్ ఫర్ స్యూర్' అనే నినాదంతో మండల కేంద్రంలో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం తెలిపారు. శనివారం ఉదయం 6గంటలకు శంకర్‌పల్లి చౌరస్తానుంచి షాబాద్ చౌరస్తా వరకు ఈ రన్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోరాట యోధుడు.. సర్వాయి పాపన్న

జిల్లావ్యాప్తంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. గౌడసంఘం ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి



షాబాద్‌లో నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు



శంకర్‌పల్లి: నివాళి అర్పిస్తున్న నాయకులు



కేశంపేట: ఎక్లాస్‌ఖాన్‌పేటలో నివాళులర్పిస్తున్న నేతలు



నందిగామ: చేగూరులో పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



చేవెళ్లలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు



షాద్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



మొయినాబాద్‌రూరల్: ఎన్కెపల్లిలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీశైలంగౌడ్

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

బంట్వారం: అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని బీజేపీ గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గృహలక్ష్మి పథకం కింద అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల హామీలు దళిత బంధు, బీసీబంధు, మైనార్టీబంధు పథకాల కింద అర్హులకు ఆర్థిక సహాయం అందజేయాలని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి, దళితులకు ఇస్తామన్న మూడెకరాల చొప్పున వ్యవసాయ భూమిని వెంటనే అమలు చేయాలన్నారు. లేని యెడలా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశంగౌడ్ తదితరులు

ఈవీఎంలపై అవగాహన ఉండాలి



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న సీఐ రాములు

కొడంగల్ రూరల్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ రాములు సూచించారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈవీఎం, వీవీప్యాట్ల పనితీరును తెలుసుకోవాలని, ఎలా ఓటు వేయాలో, ఓటు వేసిన అనంతరం తమ ఓటు సద్వినియోగం అయిందా లేదా పరిశీలించుకోవాలని సూచించారు. కొన్ని సెకన్లపాటు తాము ఓటు వేసిన గుర్తు స్క్రీన్‌పై వస్తుందని, దానికి గ్రహించాలని చెప్పారు. అవగాహన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో పర్సాపూర్ సర్పంచ్ సయ్యద్ అంజద్, నాయకులు నీలినారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్లుగా ఐదుగురు

యాలాల: తాండూరు ఏఎంసీ నూతన పాలక వర్గంలో డైరెక్టర్లుగా మండలానికి చెందిన ఐదుగురిని ఖరారు చేసినట్లు తెలిసింది. కొత్త పాలకవర్గంలో దేవనూరుకు చెందిన మంత్రి వెంకటయ్య, తిమ్మాయిపల్లికి చెందిన కృష్ణకుమార్, ముద్దాయిపేట శ్రీనివాస్‌గౌడ్, రేళ్లగడ్డతండాకు చెందిన గోవింద్‌నాయక్, కోకట్‌కు చెందిన ముస్తఫా పేర్లను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

మొక్కజొన్న పంట పరిశీలన

షాద్‌నగర్‌రూరల్: వర్షాభావ పరిస్థితులనుంచి పంటలను కాపాడుకోవాలని ఏఓ నిషాంత్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం శేరిగూడ, కొండన్నగూడ గ్రామాలలో ఏఓ నిషాంత్‌కుమార్ పర్యటించి ఎండిన పంటలను పరిశీలించారు. మండల పరిధిలో వానాకాలం సీజన్‌లో మొక్కజొన్న పంట 4,800 ఎకరాలు, జొన్న 120, పత్తి 1,760, వరి 9,150 ఎకరాలలో సాగు చేశారన్నారు. మొక్కజొన్న పంట అన్ని గ్రామాలలో వాడి పోయిన స్థితిలో ఉందన్నారు. వర్షాభావ పరిస్థితులనుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు కృషి చేయాలన్నారు. 2 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటికి కలిపి పంటలపై పిచికారి చేసుకోవాలని సూచించారు.



పంటను పరిశీలిస్తున్న నిషాంత్‌కుమార్

నిరీక్షణకు తెర

- తండాలకు తీరుతున్న 40 ఏళ్ల బీటీరోడ్డు కల
- హర్షం వ్యక్తంచేస్తున్న గిరిజనులు



రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న గిరిజన నాయకులు, పీఆర్ డీఈఈ

యాలాల: నాలుగు దశాబ్దాల బీటీరోడ్డు నిరీక్షణకు మోక్షం లభించడంతో తండాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. యాలాల మండలం సంగాయగుట్టతండా అనుబంధ తొప్పెర్లగడ్డతండాకు 40 ఏళ్లుగా బీటీరోడ్డు సౌకర్యం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, ఇతరత్రా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద సంగాయగుట్టతండా బీటీరోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు, తొప్పెర్లగడ్డతండాకు రూ.90 లక్షలు 2020లో నిధులు మంజూరు అయ్యాయి. ఆయా తండాలకు మంజూరైన బీటీరోడ్డు పనులను శుక్రవారం పంచాయతీరాజ్ డీఈ కరుణాకర్‌చారి, ఏఈ సంతోష్‌కుమార్ సర్పంచ్ లలితాబాయి రెడ్యానాయక్, ఉపసర్పంచ్ కిషన్ నాయక్‌ల సమక్షంలో సుదీర్ఘ కాలం అనంతరం పనులను ప్రారంభించారు. దీంతో ఇన్నేండ్లకు రోడ్డు కల తీరుతుందని గిరిజనులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ఫార్మసీ విద్యతో ఉపాధి మెండు

మొయినాబాద్‌రూరల్: ఫార్మసీ విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని యశోద ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో భాస్కర ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు వీడుకోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యను అభ్యసించిన విద్యార్థులు భావి తరాలకు ఉపయోగపడేలా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఉన్నత శిఖరాలకు అధిరోహించి భవిష్యత్ కోసం పాటుపడాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో డాక్టర్ దసక, సీఏ రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌ఓడి డాక్టర్ కిషోర్‌బాబు, సాయినాథ్, సుష్మిత, సబిత, సతీశ్ పాల్గొన్నారు.

శంకరయ్యగౌడ్, శాంతమ్మ మృతదేహాలకు నివాళి



నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో మృతి చెందిన సింగిల్ విండో డైరక్టర్ శంకరయ్యగౌడ్, శాంతమ్మ మృత దేహాలకు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. భర్త మరణ వార్త విని భార్య మృతి చెందడం బాధాకరమన్నారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కొందుర్గు: కొందుర్గు సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తునట్లు ప్రిన్సిపాల్ థామస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మిగిలి పోయిన సీట్లను భర్తీచేయడం కోసం ప్రభుత్వం ఈ అవకాశం ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఎంపీసీలో 5, బైపీసీలో 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని క్యాటగిరి రిజర్వేషన్ల ప్రకారం సీట్లు భర్తీచేస్తామని ఆయన పేర్కొన్నారు. 2023, ఏప్రిల్‌లో పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని, ఆసక్తి గలవారు కళాశాలను సందర్శించాలని సూచించారు.

సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లోకి వలసలు పెరుగుతున్నాయి. శుక్రవారం మండల కేంద్రంలోని మైనార్టీలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. మైనార్టీల కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో మహ్మద్ అన్వర్, వసీముద్దీన్, మక్బూల్‌తో పాటు 18మంది ఉన్నారు. ఇందులో వైస్‌ఎంపీపీ శ్రావణ్‌కుమార్‌గౌడ్ తదితరులున్నారు.

శంకర్‌పల్లి అభివృద్ధే లక్ష్యం

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురంలో పలు పార్టీల నాయకులకు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం బుల్కాపురంలోని చెరువును సందర్శించారు. త్వరలోనే చెరువులో చేప పిల్లలను వదిలి మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ భవన నిర్మాణ పనులకు, మున్సిపాలిటీ షాపింగ్ మాల్, ప్రధాన చౌరస్తాలో హైమాక్స్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్‌పల్లి మున్సిపాలిటీ పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతీ వార్డులో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ, మంచి నీటి సౌకర్యాలను మెరుగుపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు జూలకంటి లక్ష్మమ్మ, జూలకంటి శ్వేత, పార్శి రాధ, చంద్రమౌలి, శ్రీనాథ్‌గౌడ్, గోపాల్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీకండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

అందరి భాగస్వామ్యం తప్పనిసరి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం తప్పనిసరని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన కొత్తూరు మున్సిపాలిటీ చైర్ పర్సన్ లావణ్యతో కలిసి సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో సీసీ రోడ్లను వేస్తున్నట్లు పేర్కొన్నారు. కూరగాయాలు, మాంసం, పండ్ల దుకాణాలను రోడ్ల పక్కనే కాకుండా ఒకే చోట విక్రయించుకునే విధంగా సమీకృత మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజలు, నాయకులు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు. అందరి భాగస్వామ్యంతో పట్టణాలు మరింత అభివృద్ధి సాధిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ వీరేందర్, దేవేందర్ యాదవ్, జనార్దన్‌చారి, దేవేందర్‌ముదిరాజ్, మల్లేశ్, యాదయ్య, రాజేందర్‌గౌడ్, శ్రావణ్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

టీడీపీతోనే బలహీన వర్గాల అభ్యున్నతి

పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు

షాద్‌నగర్: టీడీపీ హయంలోనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి జరిగిందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు అన్నారు. శుక్రవారం లింగారెడ్డిగూడ గ్రామంలో టీడీపీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి టీడీపీ ఎంతో కృషి చేసిందన్నారు. విద్యా, వైద్యం, మహిళా సాధికారత కోసం స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు కృషి చేశారని గుర్తుచేశారు. గ్రామాల అభివృద్ధికి జన్మభూమి చేపట్టారన్నారు.

గ్రామ కమిటీ..

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా వీరేష్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా సాధక్‌పాషా, కార్యనిర్వాహకుడిగా శంకరయ్య, కోశాధికారిగా నర్సింలును ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు బక్కని నర్సింలు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, కందూరి అంజయ్య, యాదయ్య, ఎర్ర సుజాత, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న బక్కని నర్సింలు

సకాలంలో గుర్తిస్తే నివారణ సులభం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: కుష్ఠువ్యాధిని సకాలంలో గుర్తిస్తే సులభంగా దీన్ని నివారించొచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. శుక్రవారం రాయికల్ సబ్‌సెంటర్‌ను డిప్యూటీ డాక్టర్ జయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్ఠువ్యాధి ఉన్నవారు స్పర్శ కోల్పోవడం ప్రధాన లక్షణమన్నారు. మొద్దుబారిన చర్మం, కనుబొమ్మలు రాలిపోవడం, చెవి తమ్మెలు మందంగా మారడం, చేతులు, కాళ్లు తిమ్మిర్లు రావడం, వాపులు, పుండ్లు, బొబ్బలు, ముక్కునుంచి రక్తం కారడంవంటి లక్షణాలు ఉన్నవారు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిందు, డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జయలక్ష్మి

ప్రతీ ఇంటికి వెళ్లాలి

- 26న చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభ
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల: చేవెళ్లలో జరిగే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు ప్రతీ ఇంటికి వెళ్లాలని, ప్రతీ వ్యక్తిని కలవాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని అట్లాస్‌మినీ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్లలో నిర్వహించబోయే బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పరిగి మాజీ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ బహిరంగ సభ ఉంటుందని ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలతో పాటు నాయకులు హాజరవుతారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

సెకండ్ ఏఎన్‌ఎంలను విస్మరించిన ప్రభుత్వం

- కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను తొలుత క్రమబద్ధీకరించాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్

కొడంగల్ రూరల్: రెండు దశాబ్దాలుగా ప్రజారోగ్యం పరితపిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను విస్మరించి, ప్రభుత్వం కొత్తగా నియామకాలు చేపట్టకోసం నోటిఫికేషన్ వేయడం విడ్డూరంగా ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. సమస్యల సాధన కోసం ఏఎన్ఎంలు శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం నాలుగు రోజులుగా ఏఎన్‌ఎంలు నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 1,520 పోస్టులకు సంబంధించి వేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో 5,160మంది సెకండ్ ఏఎన్‌ఎంలు 20ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని, ఇందులో కొందరి వయస్సు పైబడి పోతున్న క్రమంలో ప్రభుత్వం స్పందించి వారిని క్రమబద్ధీకరించాలని కోరారు. ఇందులో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు లీలావతి, సభ్యులు రాములమ్మ, అనిత, కవిత, అనంతలక్ష్మి, అనురాధ, శ్రీలత, పుష్పలత, మంజుళ, సంగీత ఉన్నారు.

కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలి

అనంతగిరి: కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, సెకండ్ ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. వికారాబాద్ పట్టణం ఎన్టీఆర్ చౌరస్తాలో ఏఎన్‌ఎంలు మానవహారం నిర్వహించగా.. వారికి సంఘీభావం తెలుపుతూ ఆయన మాట్లాడారు. వైద్య శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఏఎన్‌ఎం లను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఇందులో సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్, చంద్రయ్య, స్నేహలత, మణికంఠ, లలిత, సుజాత, రోజ, అనంతమ్మ, భాగ్యలక్ష్మి, చంద్రకళ ఉన్నారు.